ఉచిత వైద్య శిబిరం

కీసర: గోధుమకుంటలో నేడు ఉదయం ఓమౌజియా ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోధుమకుంట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించే ఉచిత వైద్య శిబిరంలో అనుభవజ్ఞులైన ఉస్మానియా, యశోద ఆసుపత్రులకు చెందిన వైద్యులతో ప్రజలకు ఉచితంగా వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేయనున్నట్లు తెలిపారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగ అవకాశాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్‌లో 104 హెల్ప్‌లైన్‌లో ఉద్యోగ ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఈఎంఆర్ఐ ప్రతినిధులు తెలిపారు. బీఎస్సీ లైఫ్ సైన్స్, బీ ఫార్మసీ, డీఎంఎల్‌టీ, ఏఎంఎం, జీఎన్ఎం విద్యార్హత గల 30 ఏళ్ల వయస్సు లోపు గల అభ్యర్థులు అర్హులని, మరిన్ని వివరాలకు 7995061581 నెంబర్‌కు సంప్రదించగలరని తెలిపారు.

వెన్నెల గద్దర్‌కు శుభాకాంక్షలు



మేడ్చల్‌రూరల్: రాష్ట్ర సంస్కృతి సారథి చైర్ పర్సన్‌గా నియమితులైన వెన్నెల గద్దర్‌ను శనివారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు భానుచందర్, సుధాకర్, ప్రభాకర్, మైసయ్య తదితరులు ఉన్నారు.

దేశానికి క్రమశిక్షణ కలిగిన పౌరులను అందించాలి

శామీర్‌పేట్: దేశానికి క్రమ శిక్షణ కలిగిన పౌరులను అందించాల్సిన బాధ్యత పాఠశాలలపై ఉందని ట్రాస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీలోని విజ్ఞాన భారతి పాఠశాలలో నిర్వహిస్తున్న ఎల్ఎల్‌సీ (విజ్ఞాన ప్రదర్శన)ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ట్రాస్మా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, మండల కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. అనంత లోకాలకు


సంఘటనా స్థలంలో లక్ష్మయ్య మృతదేహం

ఘట్‌కేసర్: దైవ దర్శనానికి వెళ్తూ అనంత లోకాలకు చేరుకున్న ఘటన ఘట్‌కేసర్‌లో శనివారం ఉదయం జరిగింది. ఈ సంఘటనలో భార్య కళ్లెదుటే భర్త మరణించాడు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరువు బండ్లగూడ, బాలాజీనగర్‌కు చెందిన మన్నె లక్ష్మయ్య (55) భార్య మన్నె నాగజ్యోతితో కలిసి హీరో హోండా ద్విచక్ర వాహనంపై యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దర్శనానికి బయల్దేరారు. యంనంపేట్ చౌరస్తా వద్దకు చేరుకోగానే టీఎస్-30-టీఏ-3335 నెంబర్ లారీ వారిని ఢీ కొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన నాగజ్యోతిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. భర్త తన ఎదుటే మరణించడంతో ఆమె కన్నీరు మున్నీరైంది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గట్టుప్పల్‌కు చెందిన లారీ డ్రైవర్ శివశేఖర్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్ అశ్రద్ధ కారణంగానే ప్రమాదం జరిగిందన్న భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పంజా విసురుతున్న చలి పులి

- గజగజ వణుకుతున్న జనం
- రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- పొగమంచుతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


పూడూర్‌లో కమ్ముకున్న పొగ మంచు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్‌లో చలి పులి పంజా విసురుతోంది. గత నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో జనం గజగజ వణుకుతున్నారు. ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పడిపోతుండడం, చలిగాలుల తీవ్రత ఉండడంతో ప్రజలు చలికి విలవిలలాడుతున్నారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి వంటి పట్టణాల్లో రాత్రి 11 గంటల వరకు రద్దీగా ఉండే ప్రాంతాలు 8 గంటలకే నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం ఎండ వచ్చే వరకు ప్రజలు రోడ్ల పైకి రావడం లేదు. చలితో పాటు పొగ మంచు ప్రభావం ఉండడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. చలి తీవ్రతతో పలు గ్రామాల్లో ప్రజలు చలి మంటలు కాచుకుని ఉపశమనం పొందుతున్నారు.

పడిపోతున్న ఉష్ణోగ్రతలు..

శీతాకాలంలో సాధారణంగా డిసెంబర్ నెలలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. అప్పుడే చలి తీవ్రత గణనీయంగా పెరుగుతుంది. జనవరి నెలలోనూ అధికంగా ఉంటుంది. అందుకు భిన్నంగా ఈ సారి నవంబర్ మూడో వారం నుంచే చలితీవ్రత పెరిగింది. రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోతుండడంతో చలికి జనం అల్లాడుతున్నారు. గత మూడు రోజులుగా మేడ్చల్‌లో 16 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 9 గంటల వరకు చలి తీవ్రత కొనసాగుతుండగా సాయంత్రం 5 గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ఉదయాన్నే విధులకు వెళ్లే ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. చలి తీవ్రతతో పాటు పొగమంచు ప్రభావం పెరిగింది. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు తగ్గడం లేదు. తెల్లవారుజామున వాహనదారులు పొగ మంచు కారణంగా ఇబ్బందులు పడుతున్నారు.

స్వెటర్లు, మంకీ క్యాప్‌లకు డిమాండ్..

చలితీవ్రత కారణంగా ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. స్వెటర్లు, మంకీ క్యాప్‌ల అమ్మకాలు జోరందుకుంటున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యాపారులు మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జాతీయ రహదారి పక్కన వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకుని విక్రయిస్తున్నారు. బట్టల దుకాణల్లోనూ స్వెటర్ల అమ్మకాలు పెరిగాయి. చిన్నపిల్లలకు స్వెటర్లు రూ.200 నుంచి 400 మధ్య, పెద్దవారికి రూ. 300 నుంచి రూ. 1000 వరకు ఉండగా, మంకీ క్యాప్‌లు రూ.100 నుంచి 300 ధరలో దొరుకుతున్నాయి. మంచి బ్రాండ్ స్వెటర్లు రూ. 500 నుంచి రూ. వేలలో ఉన్నాయి.


చలికాచుకుంటున్న యువకులు

పెరుగుతున్న జ్వరాలు..

చలితీవ్రత, వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలతో పాటు దగ్గు, జలుబు, గొంతునొప్పి లక్షణాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో ఆసుపత్రులు జనాలతో కిక్కిరుస్తున్నాయి. చలిలో తిరిగే వారు దురద, ఎలర్జీ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. చిన్నారుల్లో జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. కొందరు చిన్నారులు శ్వాస తీసుకోవడానికి ఇబ్బందులు పడే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. చలికాలంలో శ్వాసకోస సంబంధిత సమస్యలు ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చిన్నారులకు నిత్యం వెచ్చగా ఉండేలా స్వెటర్లు వేయాలని, వేడి నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

సొంత ఖర్చుతో లైట్లు ఏర్పాటు చేసిన చైర్‌పర్సన్


ఘనాపూర్‌లో.. విద్యుత్ లైట్లు ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య


అవుషాపూర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో నూతనంగా విలీనమైన ఘనాపూర్, అవుషాపూర్, అంకుషాపూర్ గ్రామాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో విద్యుత్ దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వివరించారు. దీంతో ఆయా గ్రామాల్లో లోఓల్టేజ్ సమస్యతో చెడిపోయిన 54 విద్యుత్ లైట్లను చైర్‌పర్సన్ సొంత డబ్బుతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో విద్యుత్ లైట్ల ఏర్పాటు, విద్యుత్ సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బీ-బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మాజీ సర్పంచులు గోపాల్‌రెడ్డి, రూప్‌సింగ్, మాజీ ఉపసర్పంచులు పరమేష్‌గౌడ్, కృష్ణగౌడ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వామన్‌రెడ్డి, జంగయ్య ముదిరాజ్, మాధవరెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎదులాబాద్‌ను సందర్శించిన ఒడిశా ప్రజా ప్రతినిధులు


దివ్యాంగుల పునరావాస కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఒడిశా ప్రతినిధులు



ఎదులాబాద్‌లో.. ఒడిశా ప్రతినిధులు, అధికారులు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ గ్రామాన్ని ఒడిశా ప్రజా ప్రతినిధులు, అధికారులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించి వారితో మాట్లాడారు. బుద్ధి మాంద్యం, మానసిక దివ్యాంగుల ఎదుగుదలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని డ్వాక్రా మహిళలతో సమావేశమయ్యారు. మహిళలు చేపడుతున్న వ్యాపార కార్యక్రమాలు, ఇతర కార్యకలాపాలు, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి చేపడుతున్న అంశాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఒడిశా నుంచి సర్పంచ్ ప్రమోద్‌కుమార్, జెడ్పీటీసీ సంపత్‌రావు, మేడ్చల్ డీఆర్‌డీఓ సాంబశివరావు, డీపీఎం సురేఖ, ప్రభాకర్, స్థానిక ఎంపీడీఓ గీతారెడ్డి, ఎంపీఓ రవినాయక్, ఏపీఎం చౌర్యానాయక్, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్వామివారికి క్షీరాభిషేకం


స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పూజారులు


వంట పాత్రలు అందజేస్తున్న సంతోష్‌గౌడ్ తదితరులు

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామికి శనివారం అర్చకులు క్షీరాభిషేకం పూజను కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన స్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం నిర్వహించిన క్షీరాభిషేకం పూజలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం పాల్గొన్నారు. సాయంత్రం నిర్వహించిన సాముహిక దీపోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వంట పాత్రలు విరాళంగా అందజేత: కీసరగుట్ట శ్రీ భవానీరామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి నిత్యం భక్తులకు అందించే ఉచిత అన్నప్రసాదాన్ని వండేందుకు అవసరమైన సుమారు 70 వేల రూపాయలు విలువ చేసే వంటపాత్రలు, రెండు గ్యాస్‌స్టవ్‌లు తదితర సామాగ్రిని అహ్మద్‌గూడకు చెందిన సంతోష్‌గౌడ్ శనివారం దేవస్థానం చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డికి అందజేశారు.

శుభాకాంక్షలు

కీసర: తిరుమల తిరుపతి దేవస్థానం (టీ.టీ.డీ) ట్రస్ట్‌బోర్డు సభ్యుడిగా నియమితులైన మహేందర్‌రెడ్డిని శనివారం కీసర మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కృష్ణాయాదవ్, మాజీ ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, సీనియర్ నేత జయరాం, శ్రీధర్ రెడ్డి, రమేష్ తదితరులు బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో కలిసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కీసరగుట్ట స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.



బీజేపీ నేతల సంబరాలు


నాగారంలో..



కీసర: మహారాష్ట్రలో బీజేపీ పార్టీ ఘన విజయం సాధించిన సందర్భంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి చౌరస్తాలో బీజేపీ నేతలు విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, నేతలు జంగారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నరేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రాజు, జ్యోతి, పాండే తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌లో.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ, ఎన్‌డీఏ కూటమి విజయం సాధించడంతో మేడ్చల్‌లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పట్టణంలో వివేకానంద విగ్రహ కూడలి వద్ద టపాసులు పేల్చి, మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌గౌడ్, లక్ష్మణ్, కిషన్‌రావు, హేమలతారెడ్డి, రాఘవరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో సాముహిక సత్యనారాయణ వ్రతాలు


సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు


భక్తులకు అన్నప్రసాద వితరణ

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన శ్రీ చీర్యాల లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా శనివారం సాముహిక సత్యనారాయణ వ్రతాల్లో భక్తులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. దేవాలయ మండపంలో నిర్వహించిన సత్యనారాయణ వత్రాల్లో పాల్గొన్న భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో పూజా సామాగ్రిని అందజేశారు. అనంతరం భక్తులకు ఉచితంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు.

కేజీఆర్ కళాశాలలో రక్తదాన శిబిరం

కీసర: రక్తదానం ఎన్నో ప్రాణాలకు అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. శనివారం రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్ పారిశ్రామిక వేత్తల సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన కళాశాల చైర్మన్ గోవిందరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజం మనకేమి చేసిందని కాకుండా మనం సమాజానికి సాధ్యమైన మేరకు సాయం చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల చైర్మన్ గోవిందరెడ్డి, విద్యార్థులు, అధ్యాపకులు సైతం రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రమణరావు, ప్రిన్సిపాల్ విజయకుమార్, అధ్యాపకులు, నాగరాజు, సింధూజ, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





వైజ్ఞానిక ప్రదర్శనను బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గాగిల్లాపూర్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22,23 తేదీల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి అనేక ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ప్రతి సంవత్సరం అన్ని జిల్లాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా జిల్లాలలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు సమన్వయంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తుంటారు. కానీ మేడ్చల్ జిల్లాలో మాత్రం ఉపాధ్యాయుల తరపున ఎన్నికైన ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని జిల్లా అధికార యంత్రాంగం ఆహ్వానించకపోవటంతోపాటు ఉపాధ్యాయ సంఘాలకు కనీస సమాచారం అందించకపోవటాన్ని ఆ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనికి నిరసనగా ఉపాధ్యాయ సంఘాలు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను బహిష్కరించినట్లు పేర్కొన్నాయి. ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రతినిధులు శ్రీధర్, నవీన్, వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, మదన్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

పోచారం: సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు చైర్మన్ కొండల్‌రెడ్డి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఎడ్ల చిన్నకు రూ. 19,500, విష్ణుకు రూ. 12,500 చెక్కులు అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని శనివారం మున్సిపల్ పరిధిలోని సిద్ధార్థనగర్ కాలనీలో గల కమ్యూనిటీహాల్‌లో ఘనంగా నిర్వహించారు. నూతన కమిటీ అధ్యక్షులు గాదె రాముతోపాటు, ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌రావు, కరుణాకర్, పూర్ణచందర్, రాజానాగేంద్ర, కోశాధికారి, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శి రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్, సలహాదారులుగా శ్రీనివాస్, నాగరాజ్, కార్యవర్గసభ్యులు శివకుమార్, విజయ్‌కుమార్ గుప్తా తదితర కమిటీ సభ్యులందరితో వెంకటేశం ప్రమాణ స్వీకారోత్సవం చేయించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేడ్చల్‌జిల్లా ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు రమేష్‌గుప్తా, బచ్చు నగేష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, శ్రావన్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా నేడు పలు ప్రాంతాల్లో కరెంట్ సరపరా ఉండదని ఏఈ రాంబాబు తెలిపారు. ప్రధానంగా పరిశ్రమలకు నేడు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు. మేడ్చల్ పారిశ్రామికవాడ, చెక్ పోస్ట్ ప్రాంతం, సీఎంఆర్ కళాశాల, సుతారిగూడ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

ఘట్‌కేసర్‌లో.. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా అంకుషాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, మాదారం 11 కేవీ ఫీడర్ పరిధిలో ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మాదారం, కసిరెడ్డి నారాయణరెడ్డి పౌల్ట్రీ ఫామ్, బంగారు రాజు పౌల్ట్రీ ఫామ్, రుచి పౌల్ట్రీ ఫామ్, మందాకిని పౌల్ట్రీ ఫామ్, ఫార్మల్ కంపెనీ, హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్, స్వర్ణభూమి వెంచర్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఘట్‌కేసర్ ఏఈ బలరాం తెలిపారు.

గొడవను అడ్డుకోబోయిన వ్యక్తిపై హత్యాయత్నం

మేడ్చల్‌రూరల్: ఇద్దరి మధ్య గొడవ జరుగుతుండగా సర్దిచెప్పేందుకు వెళ్లిన వ్యక్తిపై మద్యం మత్తులో దాడికి పాల్పడడంతోపాటు బాధితుడి సోదరుడిపై కూడా కత్తితో దాడి చేసిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మునీరాబాద్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ మన్మధ్ తెలిపిన వివరాల ప్రకారం.. మునీరాబాద్ గ్రామంలో ఓంకార్ అనే వ్యక్తి పాన్‌షాపు నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన ధనరాజ్ శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో మద్యం మత్తులో పాన్‌షాపు వద్దకు వెళ్లి నిర్వాహకుడు ఓంకార్‌తో వాగ్వాదానికి దిగాడు. దీంతో అటుగా వెళ్లిన భరత్ అనే యువకుడు గొడవను ఆపే ప్రయత్నం చేయగా ఆగ్రహానికి గురైన ధనరాజ్.. భరత్‌తో వాగ్వాదానికి దిగి అతనిపై దాడికి పాల్పడ్డాడు. దీంతో భరత్ అతని సోదరుడు విఠల్ (25)కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. విఠల్ సంఘటనా స్థలానికి వచ్చే లోగా ధనరాజ్ తన ఇంటికి వెళ్లి కత్తిని తన వెంట తెచ్చుకున్నాడు. ఘటన స్థలానికి వచ్చిన విఠల్‌తో సైతం వాగ్వాదానికి దిగిన ధనరాజ్ మద్యం మత్తులో విచక్షణారహితంగా అతడిపై దాడికి పాల్పడి కత్తితో రెండు చోట్ల పొడిచాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన విఠల్‌ను చికిత్స నిమిత్తం నారాయణ మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మేడ్చల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా నిందితుడు ధనరాజ్ పరారయ్యాడు.దాడి సమయంలో మరో ముగ్గురు యువకులు అక్కడే ఉన్నారు. విఠల్ కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ధన్‌రాజ్‌పై కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. విఠల్‌కు సర్జరీ చేసిన వైద్యులు ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందన్నారని, విఠల్‌పై పాత కక్షతోనే దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపాలిటీ ఆదాయం పెంచేలా పని చేయాలి

మేడ్చల్: మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా సిబ్బంది రెవెన్యూ వసూళ్లు చేయాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇళ్ల నీటి పన్నులు వసూలు చేయడం, ఇంటి నెంబర్లు కేటాయించడం, ట్రేడ్ లైసెన్సుల జారీతో వసూళ్లు చేపట్టాలని సూచించారు. ప్రతీ ఆర్థిక సంవత్సరం ప్రారంభ దశలోనే పన్ను రిబేట్‌ల ద్వారా ఆదాయం పొందేలా చూడాలని అన్నారు. సిబ్బంది విస్తృతంగా పర్యటనలు చేసి ప్రజలు బకాయిలు లేకుండా పన్నులు వసూలు చేసి ఆదాయం పెంచాలని కోరారు.

